## ఓరుగల్లు నేలే ఒక సాహిత్య వారసత్వం

పాల్కురికి సోమనాథుడు, బమ్మెర పోతన, జాయప సేనాని నుండి అభినవ వేమన ప్రజాకవి కాళోజీ, ప్రముఖ విప్లవకవి వరవరరావు, ప్రముఖ నవలాకారులు డా. అంపశయ్య నవీన్ దాకా ఒక మహోజ్జ్వలమైన సాహిత్యం నేపథ్యం గల ఓరుగల్లు నేలపై జన్మించడమే పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. నేను 8 జూలై 1950న పుట్టాను. 'రామా' ఇంటిపేరు గల కుటుంబాలు ఎక్కువగా ఉండడం వల్ల నేను నివసిస్తున్న ప్రాంతం పేరు 'రామా వారి వీధి'. మా నాన్నగారు రామా కనకయ్య, అమ్మ రాజ్యలక్ష్మి. చాలా పెద్ద మధ్య తరగతి కుటుంబం మాది. ప్రసిద్ధి చెందిన అజంజాహి మిల్లు (బట్టల మిల్లు)లో మా నాన్న గారు పని చేసేవారు. మా కుటుంబంలో ఎటువంటి సాహిత్య వాసనలూ లేవు.



భార్యా పిల్లలతో...

## ఉన్నత పాఠశాలే సాహిత్యాసక్తికి కేంద్రం

నా ఉన్నత విద్యాభ్యాసమంతా వరంగల్లులోని మహబూబియా ఉన్నత పాఠశాలలో జరిగింది. ప్రముఖ విద్యావేత్త బజారు హనుమంతరావు గారు మా ప్రధానోపాధ్యాయులు. కాళోజీకి గురువైన గార్లపాటి రాఘవ రెడ్డిగారు మాకు తెలుగు పాఠాలు బోధించేవారు. ప్రతి తరగతిలోనూ ఒక చిన్న గ్రంథాలయం ఉండేది. మహాభాగవతం, వసుచరిత్ర, మనుచరిత్ర వంటి పుస్తకాలను చదివి తెలుగుసార్‌తో చర్చించేవాళ్ళం. 1963 నవంబర్ 13న ప్రజాకవి కాళోజీ 'నా గొడవ' పుస్తకాన్ని మహాకవి శ్రీశ్రీ మా మహబూబియా ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఆ సంవత్సరమే... అంటే నేను తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు నా మొట్టమొదటి కథ 'సువర్ణ శతదళ పుష్ప రహస్యం' బాలల మాసపత్రిక 'చందమామ'లో ప్రచురించబడింది. ఆ రోజు పొందిన ఆనందం మాటలకందనిది. ఆ కథ వెలువడ్డప్పుడు మా ప్రధానోపాధ్యాయులు, తెలుగు సార్ రాఘవరెడ్డిగారు అభినందించడం, ఆశీస్సులందజేయడం ఒక మరుపురాని మహానుభూతి.

## చదవడం, రాయడం.... ఒకటే లోకం

ప్రతి సాయంకాలం వరంగల్లులో అప్పుడుండే శ్రీ వాసవీ గ్రంథాలయం లేదా మట్వాడాలో ఉన్న వాగనుశాసన గ్రంథాలయం వీటిలో ఏదో ఒక చోటికి తప్పకుండా వెళ్ళే వాణ్ణి. శరత్ సాహిత్యం, చలం సాహిత్యమంతా, విశ్వనాథ వేయిపడగలు, శ్రీశ్రీ మహాప్రస్థానం, తిలక్ అమృతం కురిసిన రాత్రి వంటి పుస్తకాలన్నీ అప్పుడు చదివినవే! ప్రారంభదశలో పిల్లల కథలు, కథలు, కవితలు ఎక్కువగా రాసేవాడిని. మొదటి కథ 'మజిలీ' ఆంధ్రపత్రికలో 1970లో వచ్చింది. ఇక అప్పటినుండి జైత్రయాత్రే! అప్పుడు ఎంత వేగంగా రాసేవాడినంటే... ఏ పత్రిక చూచినా నా రచనలే కనిపించేవి. కథ, కవిత, వ్యాసం... ఏదో ఒకటి మొదట 'భారతి'లో నా కవిత వెలువడ్డరోజు ఎంత పొంగిపోయానో, నా మిత్రులు నన్ను 'బాలమిత్ర టు భారతి' రచయిత అని వ్యాఖ్యానించేవాళ్ళు. అప్పుడే మిత్రుడు బండారీ ఉమామహేశ్వరరావు, చామర్తి ఉమామహేశ్వరరావు, ముదిగొండ వీరభద్రయ్య, అందరం కలిసి 'లహరి' లిఖిత మాస పత్రికను నిర్వహించే వాళ్ళం.

## మొట్టమొదటి నవల

మద్దుకూరి చంద్రశేఖరరావు గారి సంపాదకత్వంలో వెలువడిన ఓ 'ప్రగతి' వారపత్రికలో నా మొదటి నవల. 'శాపగ్రస్తులు' సీరియల్‌గా ప్రచురించబడ్డది. దానితో సమాంతరంగా అంపశయ్య నవీన్ గారి 'విచలిత' నవల కూడా అప్పుడే సీరియల్‌గా వెలువడింది. ఒకే ఊరి రచయితలిద్దరి నవలలు ఒకేసారి ఒకే పత్రికలో సీరియల్‌గా వస్తుండడం ఒకింత ఆశ్చర్యంతో కూడిన ఆనందాన్ని కలిగించేవి. అప్పటికి నేను నా మెకానికల్ ఇంజినీరింగ్ చదువును రీజనల్ ఇంజినీరింగ్ కళాశాల నుండి పూర్తి చేసుకుని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 1970 ఫిబ్రవరిలో డిమాన్‌స్ట్రేటర్‌గా చేరడం... తదాదిగా అధ్యాపక జీవితం... ముప్ఫయ్యారేళ్ళ పాటు... అధ్యాపక వృత్తి నాకు ఎంతో ప్రియమైనదీ, కావాలని ఎంచుకున్నదీ, జీవితంలో ఎంతో తృప్తిని మిగిల్చింది కూడా. అంతకు ముందు ఒక సంవత్సరకాలం భిలాయ్ ఉక్కు కర్మాగారంలో 'చార్జ్‌మెన్'గా పనిచేశాను కోక్‌ఓవెన్స్ దగ్గర. అది ఒక విభిన్నమైన జీవితం.



భార్య లలితతో...

## రచయితకు సరియైన 'చూపు' అవసరం

మేము ఇంజినీరింగ్ విద్యార్థులకు ఒక వస్తువు సమగ్రతను సవివరంగా దర్శించడానికి ఒక ప్రత్యేక దృష్టిని బోధిస్తాం. దాన్ని 'ఆర్థోగ్రాఫిక్, పర్‌స్పెక్టివ్ వ్యూయింగ్' విధానాలుగా చెప్తాం. దృష్టిని బట్టే దృశ్యం ఉంటుందని సిద్ధాంతీకరిస్తాం. చూపు శాస్త్రీయంగా, సరిగ్గా లేకపోతే వస్తువు సమగ్రంగా కనబడదు సరికదా లోపభూయిష్టంగా కూడా కనబడ్తుంది. ఇదే అవగాహన రచయితలకు గానీ, ఏ సృజనకారుడికైనా అవసరమని నేను భావిస్తాను. కథగానీ, కవిత గానీ, నవల గానీ... రాస్తున్నప్పుడు ఎన్నుకుంటున్న జీవితాన్ని రచయిత విశాలమైన, సానుకూలమైన, అధ్యయనాత్మకమైన పారదర్శకమైన దృష్టితో, ప్రాసంగికతతో దర్శిస్తే తప్ప ఆ కృతి జీవవంతం కాదు.

ఊపిరి పోసుకుని పాఠకుల్ని అలరించదు. రచయిత ఎంచుకునే కథావస్తువు, ఆ వస్తువును పఠితకు అందివ్వాలనుకుంటున్న తీరు దానికదే ఒక నిర్దుష్టమైన శైలినీ, కథనాన్నీ, వ్యక్తీకరణనూ ఏర్పరచుకుంటుందని నేను విశ్వసిస్తాను. ఒక ఆంతరంగిక కల్లోలం బహుముఖీనమైన ఏదో ఒక రూపంలో నింగికెగిసే గంగలా విస్ఫోటించి దానికదే ఒక నమూనాగా మిగిలి పోతుంది. నిగ్రహాతీతమైన భావావేశంతో రచయిత మగ్నుడై సృజన చేస్తున్నప్పుడు అతను ఒక యోగిలా, యోధునిలా, ఆపాదమస్తకం జ్వలిస్తున్న జ్వాలలా భాసిస్తాడు. ప్రతి రచనా ఒక అపూర్వమైన సృష్టిగా మిగులుతుంది నిజాయితీగా నిర్వహించినప్పుడు.

### నా పరివారం... నా స్నేహితులు

నా అర్ధాంగి లలిత. నా వెంట నడుస్తూ నన్ను నడిపించేది. నలుగురు ఆడపిల్లలు. మాధురి, శుభ, పవన, రూప అందరూ ఇంజనీర్లే! ఇద్దరు ఇండియాలో, ఇద్దరు అమెరికాలో నివాసం. నలుగురు మనుమలు... నలుగురు మనమరాళ్ళు. అందరూ అద్భుతంగా నన్ను ప్రేమించేవాళ్ళు. నాచే ప్రేమించబడేవాళ్ళు. ప్రపంచ ప్రఖ్యాత ధ్వన్యనుకరణ సామ్రాట్ నేరెళ్ళ వేణుమాధవ్, డా. అంపశయ్య నవీన్, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యా, డా. ఎల్.ఎస్.ఆర్.ప్రసాద్, పొట్లపల్లి శ్రీనివాస రావు, వి.ఆర్.విద్యార్థి నా ఆత్మీయమైన మిత్రులు.

### ప్రధానంగా నేను కవిని

కొన్ని ఇతివృత్తాలను వ్యక్తీకరించడానికి తదనుకూలమైన ఒక మాధ్యమం అవసరమౌతుంది. గాఢత, సాంద్రత, లోతు ప్రధానమైన అవశ్యకాలైనప్పుడు నేను కవిత్వాన్నాశ్రయిస్తా. కవిత్వం అతిశక్తివంతమైన ఒక అనుభూతి వ్యంజన. హృదయాన్ని సూటిగా స్పర్శించి మరుక్షణం ఉద్విగ్నుణ్ణి చేస్తుంది. కథ అలా కాదు... విషయ ప్రధానమై ప్రవాహకత నిండిన నడకతో, సొగసుతో, సౌందర్యంతో మనిషిని కదిలించి ఆలోచింప చేస్తూ వృత్తికి నిప్పులా తాకి మండిస్తుంది. ఒకటి భాస్వరం... మరొకటి హారతి కర్పూరం.... రెండూ వెలిగేవే!

### ఇరవై సంవత్సరాల విరామం

సాహిత్యం మనిషిని ఎంతమేరకు ప్రభావితం చేస్తుంది. మనిషి జీవనదిశ, దశ సాహిత్య స్పర్శతో మారుతుందా... అన్న అంతర్మథనతో సతమత మౌతూ, సాహిత్యరంగంలో అదృశ్యంగా విస్తరించి ఉన్న లాబీయింగ్‌లు, సిండికేట్‌లు, పురస్కారాల పైరవీలు... అన్నీ గమనించి విసుగుచెంది, విరక్తిగలిగి 1984 నుండి 2004 వరకు అజ్ఞాతమై పోయాను. ఆ ఇరవై ఏళ్ళలో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రతిష్ఠాత్మకమైన ఆరు పాఠ్యగ్రంథాలను రచించాను. వాటి వల్ల జాతీయ స్థాయిలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఇంజనీరింగ్ టీచర్ పురస్కారాన్ని పొందాను. వృత్తిపరమైన ఆ తృప్తి వేరు.

ఐతే 2003లో ఒక యాక్సిడెంట్ కావడం వల్ల... మళ్ళీ 2004 నుండి సాహిత్యరంగ పునఃప్రవేశం... మళ్ళీ విజృంభణ... యిలా సాగుతోంది. 2008లో ప్రతిష్ఠాత్మకమైన 'సినారె కవితా పురస్కారాన్ని' ప్రదానం చేస్తూ జ్ఞానపీఠ అవార్డుగ్రహీత డా. సి.నారాయణరెడ్డి 'మా చంద్రమౌళికి విరామమే కాని విరమణ లేదు.. అతను నిత్యనూతన సృజనకారుడు' అన్న వాక్యాలు నాలుగో సింహంలా నాకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

### కేంద్ర సాహిత్య అకాడమి – కవి సంధి

23, జూన్ 2007లో కేంద్ర సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ వరంగల్లులో ఏకవ్యక్తితో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'కవి సంధి' కార్యక్రమాన్ని నాతో ఏర్పాటు చేసింది. ఒక కవి రెండు మూడు గంటలసేపు తనను తాను వినిపించడం. సాహిత్యకారులతో కవిత్వమై సంభాషించడం, కవిత్వమై ప్రవహించడం. ఆ కార్యక్రమ విశిష్టత. అశోకా హోటల్ కాన్ఫరెన్స్ హాల్ నిండా ఎందరో ప్రముఖ సాహిత్యవేత్తల సమక్షంలో 'కవి సంధి' ఒక అద్భుతానుభవం. అప్పటికి ఆంధ్రప్రదేశ్‌లో కె.శివారెడ్డి, డా. ఎన్.గోపి మాత్రమే ఎంపికచేయబడి 'కవి సంధి'ని నిర్వహించారు. మూడో వ్యక్తిగా నాకా గౌరవం దక్కింది.

ప్రతి సంవత్సరం తెలుగుభాషలో వెలువడ్తున్న ఉత్తమ వచన కవితల్ని ఒక పుస్తకంగా 2004నుండి తెస్తున్న సృజనలోకం, వరంగల్లు 'కవితా వార్షిక'కు నేను ప్రధాన సంపాదకునిగా వ్యవహరిస్తున్నాను. అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ సంపుటాలను వెలువరించడం నాకు సాహిత్యకారునిగా ఎనలేని తృప్తిని కలిగించే సంగతి.


### వర్తమాన కథ గురించి

వర్తమాన తెలుగుకథ నిస్సందేహంగా ఇతర భారతీయ భాషల్లో, ప్రపంచ భాషల్లో వస్తున్న కథలతో పోల్చిచూచినప్పుడు ఉత్తమంగానే ఉంది. వస్తువు ఎంపిక, శిల్పం, కథనం, వ్యక్తీకరణ, శైలి... ఇవన్నీ తెలుగు కథల్లో నాణ్యంగా, ప్రామాణికంగా సంతుష్టికరస్థాయిలోనే ఉన్నాయి. అయితే... మంచి కథలనూ, గొప్పకథలనూ రాయగల కథా రచయితల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. కొత్త రచయితలు తగుస్థాయిలో, విస్తృతంగా అధ్యయనం చేయకుండానే అలవోకగా కథలను రాసి పారేసి తృప్తి పడుతున్నారు. దీనివల్ల తెలుగు కథా భవిష్యత్తు కొంత ఆందోళన కరంగా కనిపిస్తోంది. అయితే మనిషి జీవితమే కలుషితమై, విలువలను కోల్పోయి, వ్యగ్రమై, అస్తవ్యస్తమై వికృతమౌతున్న వర్తమానంలో వాటి ప్రతిఫలనలు కూడా కథల్లోకి ప్రవేశించకుండా ఎలా ఉంటాయి? మనిషి వెంటనీడ, నీడ వెంట మనిషి, కథకూడా అంతే. మనిషి వెంటే, మనిషి ఉన్నంతకాలం కథ సజీవంగా ఉంటుంది.... ఒక ప్రతిఫలనగా–

– పవన్ కుమార్

## నచ్చినవి

| | |
|---|---|
| ఊరు | : వరంగల్లు |
| రచయితలు | : రావిశాస్త్రి, మాలతీ చందూర్, వడ్డెర చండీదాస్, కె.వరలక్ష్మి |
| సినిమా దర్శకులు | : కె.బాలచందర్, మణిరత్నం |
| కవి | : వేమన |
| జ్ఞాపకం | : మన పూర్వ రాష్ట్రపతి ఎ.పి.జె.అబ్దుల్ కలాంతో కలిసి కొద్దికాలం పనిచేయడం |
| గాయకులు | : ఘంటసాల, జిక్కి |
| ఆనందించే సందర్భం | : గత నలభై ఏళ్ళుగా నాచే నిర్మించబడ్డ విద్యార్థులు తారసపడ్డప్పుడు ఉక్కిరి బిక్కిరౌతూ అతి వినయంగా వ్యక్తీకరించే ప్రేమాభిమానాలు |
| ఇష్టం | : చిన్నపిల్లలతో ఆడుకోవడం, నిశ్శబ్దాకాశంలోకి చూడడం, కిటికీలో నుండి చూస్తూ కొమ్మపై పిచ్చుకల ఉనికిని ఆనందించడం, ఏకాంతంగా... మౌనంగా అలా నడుస్తూ పోవడం. |



ప్రముఖ కవి గుల్జార్‌తో...

